VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ శుక్రవారం 21 మార్చి 2025
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 240
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


2లో

# నేటి నుంచి టెన్త్ పరీక్షలు

ప్రశ్నపత్రంలో ఈసారి క్యూఆర్ కోడ్

ప్రతి పరీక్ష కేంద్రంలోనూ సీసీ కెమెరాలు



# బడే భాయ్.. చోటే భాయ్ ఇద్దరూ ఒక్కటే!

విషప్రచారంతోనే బిఆర్ఎస్ అధికారం కోల్పోయింది

అభివృద్ధి పనుల ముందు విషప్రచారమే గెలిచింది

ప్రజల పక్షాన కొట్లాడుతున్న కార్యకర్తలు వీరులు

సూర్యాపేట సభలో కెటిఆర్ ప్రసంగం


2లో

చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని, గాడిదని చూస్తేనే కదా గుర్రం విలువ తెలిసేది.. అలాగే కాంగ్రెస్ కంచర గాడిదలను చూసిన తర్వాతనే ప్రజలకు కేసీఆర్ గొప్పతనం తెలిసి వచ్చిందన్నారు. సమావేశానికి ముందు సూర్యాపేటలో పార్టీ కార్యకర్తలు నిర్వహించిన ర్యాలీలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ తదితరులు


2లో

## హరీశ్‌రావు, రాధాకిషన్‌రావులపై ఫోన్‌ట్యాపింగ్ కేసు కొట్టివేత

ఫోన్‌ట్యాపింగ్ చేశారంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఫిర్యాదు ఆధారంగా మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావులపై పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ గురువారం హైకోర్టు తీర్పు వెలువరించింది.

కేసు నమోదుకు సరైన కారణాల్లేవు

రాజకీయ శత్రుత్వం కనిపిస్తోంది

ఫిర్యాదులో అసాధారణ జాప్యం

కొనసాగింపునకు అనుమతిస్తే న్యాయ ప్రక్రియ దుర్వినియోగమే

హైకోర్టు తీర్పు

# ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్లో 30మంది మావోల హతం

నక్సల్స్ ముక్త భారత్‌లో పెద్ద విజయమన్న అమిత్ షా, రక్తమోడిన బస్తర్ మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజన్‌లో గురువారం జరిగిన రెండు భారీ ఎదురుకాల్పుల ఘటనల్లో 30 మంది మావోయిస్టులు మృతి చెందారు.

వేర్వేరు చోట్ల జరిగిన ఎదురుకాల్పుల్లో 30 మంది మావోయిస్టుల మృతి

ఓ జవాను వీరమరణం.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

2026 మార్చి నాటికి నక్సలిజం అంతం చేస్తామని పునరుద్ఘాటించిన అమిత్‌షా

మావోయిస్టుల మృతదేహాలను తరలిస్తున్న బలగాలు


2లో



# బెట్టింగ్ యాప్స్ వ్యవహారం..

హైదరాబాద్: బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ యాప్‌లను ప్రమోట్ చేసిన వారిలో ఉన్న ప్రముఖ నటీనటులపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నటీనటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు సహా మొత్తం 25 మంది ఈ జాబితాలో ఉన్నారు.సినీ ప్రముఖుల జాబితాలో రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్ ఉన్నారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లలో అనన్య నాగళ్ల, సిరి హనుమంతు, శ్రీముఖి, వర్షిణి సౌందరరాజన్, వాసంతి కృష్ణన్, శోభా శెట్టి, అమృత చౌదరి, నయని పావని, నేహా పఠాన్, పండు, పద్మావతి, ఇమ్రాన్‌ఖాన్, విష్ణు ప్రియ, హర్ష సాయి, బయ్యా సన్నీ యాదవ్, యాంకర్ శ్యామల, టేస్టీ తేజ, రీతూ చౌదరి, బండారు సుప్రీత ఉన్నారు. మియాపూర్ వాసి ప్రమోద్ శర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రానా, విజయ్ దేవరకొండ సహా పలువురు సినీ ప్రముఖులపై కేసు

బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది.

# మరో 30 రోజుల్లో గ్రూప్స్ నియామకాలు

తెలంగాణకు అద్భుతమైన సాంస్కృతిక వారసత్వం ఉంది. మన ప్రాంతాలను మనం అభివృద్ధి చేసుకోవాలి. సిలికాన్ వ్యాలీయే ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది. నిన్ననే మెక్‌డొనాల్డ్స్ కంపెనీ వచ్చింది.సీఎం రేవంత్‌రెడ్డి


2లో

నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే భారాస ఓటమి: సీఎం రేవంత్‌రెడ్డి

922 మందికి కారుణ్య, ఉద్యోగ నియామకపత్రాల అందజేత

'బిల్డ్‌నౌ పోర్టల్'ను ప్రారంభించిన సీఎం

నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే ఎన్నికల్లో భారాస ఓడిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తమకు ఉద్యోగాలు ఇవ్వనివారికి ఉద్యోగాలు ఎందుకనే ఉద్దేశంతో ఆ పార్టీని నిరుద్యోగులుఓడించారన్నారు.

# వరుగా నాలుగో రోజూ లాభాల బాట

400 పాయింట్లకు పైగా లాభాల్లో సెన్సెక్స్


2లో

వేగుచుక్క

## ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్లో 30మంది మావోల హతం



చర్ల, : మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజన్‌లో గురువారం జరిగిన రెండు భారీ ఎదురుకాల్పుల ఘటనల్లో 30 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఓ జవాను వీరమరణం పొందారు. బీజాపుర్, దంతెవాడ జిల్లాల సరిహద్దులోని ఆండ్రి అటవీ ప్రాంతంలో పెద్దఎత్తున మావోయిస్టులు ఉన్నారనే నిఘావర్గాల సమాచారంతో డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్), ఎస్టీఎఫ్ (స్పెషల్ టాస్క్‌ఫోర్స్), కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రిజల్యూట్ యాక్షన్) సంయుక్త బలగాలు బుధవారం ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకూ ఇరువర్గాల మధ్య భీకరకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 26 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారి మృతదేహాలను, పెద్దఎత్తున ఆయుధాలు, పేలుడు సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతుల్లో పశ్చిమ బస్తర్ డివిజినల్ కమిటీ సభ్యులు ఉండొచ్చని భావిస్తున్నట్లు బీజాపుర్ ఎస్పీ జితేంద్రకుమార్‌యాదవ్, దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్ తెలిపారు. బలగాలు క్యాంపులకు చేరిన తర్వాత పూర్తివివరాలు వెల్లడిస్తామన్నారు. కాంకేర్-నారాయణ్‌పుర్ సరిహద్దులోని బీనగుండా, పురుష్కోడు అటవీ ప్రాంతాల్లో మావోయిస్టు ఉత్తర బస్తర్ మాద్ డివిజన్ కమిటీ సభ్యులు ఉన్నారన్న సమాచారంతో డీఆర్‌జీ, బీఎస్‌ఎఫ్ నేతృత్వంలోని సంయుక్త బలగాలు కూంబింగ్ చేపట్టాయి. గురువారం ఉదయం ఇరువర్గాల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందగా.. డీఆర్‌జీ జవాను రాజు ఓయం వీరమరణం పొందారు. మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఆయుధాలను, ఇతర వస్తువులను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇక్కడ కాల్పులు కొనసాగుతున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

# లెక్క తప్పిన బడ్జెట్ అంచనాలు

**గత బడ్జెట్ నిధుల ఖర్చుపై పొంతన ఏదీ**

**నియోజకవర్గానికి 3550 ఇల్లు ఎక్కడ**

**మాజీమంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ప్రశ్న**



**హైదరాబాద్:**రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ వాస్తవానికి దూరంగా ఉన్నదని, అది తూతూ బడ్జెట్ అని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గురువారం సికింద్రాబాద్‌లోని తహసిల్దార్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సరం బడ్జెట్‌లో ప్రకటించిన నిధులలో ఎంత మేర ఖర్చు పెట్టారో కూడా ప్రజలకు స్పష్టం చేయాల్సిన బాద్యత ప్రభుత్వం ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలనే కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ లో పొందుపర్చడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు గత బడ్జెట్ లో కూడా ప్రకటించారని, ఎక్కడ ఇచ్చారో చూపిస్తారా అని ప్రశ్నించారు. అధికారం కోసం అనేక రకాల హామీలు ఇచ్చి ప్రజలకు లేనిపోని ఆశలు కల్పించారని, అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా హామీలు అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. వరద ముంపు సమస్య పరిష్కారం కోసం నాలాలలో పూడిక తొలగింపు పనులకు తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు పూడిక తొలగింపు పనులు ప్రారంభించలేదని, ఇంకెప్పుడు చేపడతారని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరంలో విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, త్రాగునీటికి కటకట ఏర్పడిందని, ట్యాంకర్ లే దిక్కు అన్నట్లు-గా పరిస్థితి మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రభుత్వం ఊక దంపుడు ప్రసంగాలను మానుకోవాలని హితవు పలికారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని అన్నారు. ఇప్పటి-కై-నా ప్రభుత్వం తమ చిత్తశుద్దిని నిరూపించుకోవాలని చెప్పారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని, ప్రజలు ఎదురు చూస్తున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. సికింద్రాబాద్, అమీర్‌పేట తహసిల్దార్ మండలాల పరిధిలోని 69 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల క్రింద మంజూరైన ఆర్ధిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. సికింద్రాబాద్ తహసిల్దార్ పరిధిలో 37 చెక్కులలో 20 కళ్యాణలక్ష్మి, 17 షాదీముబారక్, అమీర్ పేట తహసిల్దార్ పరిధిలో 15 మందికి కళ్యాణలక్ష్మి కింద చెక్కులను పంపిణీ చేశారు. చెక్కుల కోసం వచ్చిన పలువురు లబ్దిదారులు తులం బంగారం ఎప్పుడు ఇస్తారు సారూ అని అధికారులను ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటినా ఇప్పటి వరకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల వెంట ఇస్తామన్న తులం బంగారం హామీ అమలుకు నోచుకోలేదని, లబ్దిదారులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని తలసాని చెప్పారు. అంతేకాకుండా మహిళలకు 2500 రూపాయల ఆర్థిక సహాయం కూడా అమలు కావడం లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని, లేకుంటే ప్రజల నుండి ప్రభుత్వంపై పెద్ద ఎత్తున వ్యతిరేకత ఎదురు కానున్నదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలన్ లక్ష్మి బాల్ రెడ్డి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, సికింద్రాబాద్ తహసిల్దార్ పాండు నాయక్, అమీర్ పేట తహసిల్దార్ కార్యాలయ అధికారులు కిరణ్ కుమార్, కుమార స్వామి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అద్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్ గౌడ్, నాయకులు ప్రేమ్ కుమార్, శేఖర్, లక్ష్మీపతి, కూతురు నర్సింహ, రాజేష్ ముదిరాజ్, ఆంజనేయులు, మహేష్ యాదవ్, బలరాం, జమీర్, నోమాన్, వనం శ్రీనివాస్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధుల సాంస్కృతిక ప్రదర్శన

విజయవాడ: విజయవాడఏ కన్వెన్షన్‌లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు గురువారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలను స్వయంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, తదితరులు హాజరయ్యారు. క్రీడా, సాంస్కృతిక పోటీల విజేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు బహుమతులను అందజేసారు. దుర్యోధనుడు వేషధారణలో ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు ఆకట్టుకున్నారు. ఏమంటివి ఏమంటివి అంటూ ఎన్టీఆర్ డైలాగ్స్‌తో రఘురామకృష్ణంరాజు ఏకపాత్రాభినయం చేశారు. రఘురామకృష్ణంరాజు డైలాగ్స్‌కు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి సహా సభ్యులంతా చప్పట్లు కొట్టారు. కేరింతలతో ప్రాంగణం మార్మోగింది. తమ తమ స్థానాల్లో నిలబడి రఘురామను మంత్రులు , ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభినందించారు. దానవీరశూర కర్ణ సినిమాలోని ఎన్టీఆర్ డైలాగ్స్‌తో రఘురామ ఏకపాత్రాభినయం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరావులు హాస్య నటనతో ఆకట్టుకున్నారు. ఇరువురు ఎమ్మెల్యేలు పాటలతో హాస్యం పండించారు. ఎమ్మెల్యేల నటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ తదితరులు కడుపుబ్బా నవ్వుకున్నారు. పల్నాటి బాలచంద్రుడి వేష ధారణలో మంత్రి కందుల దుర్గేష్ అదరగొట్టారు. వేషధారణ, అద్భుతమైన డైలాగ్‌లతో అందరినీ ఆకర్షించారు. దుర్గేష్ ప్రదర్శనకు సభ్యుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి.

## వరుగా నాలుగో రోజూ లాభాల బాట



**ముంబై:** ఇటీవల వరుస నష్టాలతో కునారిల్లిన దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ లాభాల బాట పట్టాయి. వరుసగా నాలుగోరోజు కూడా లాభాలతోనే ముగిశాయి. ముఖ్యంగా ఆకర్షణీయంగా ఉన్న హెవీ వెయిట్ షేర్లలో కొనుగోళ్లు మార్కెట్లను పరుగులు తీయించాయి. అంతర్జాతీయంగా బలహీన సంకేతాలు ఉన్నప్పటికీ, చాలా స్టాక్స్ ఆకర్షణీయంగా ఉండడంతో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ లాభాల బాటలో పయనించాయి. బుధవారం ముగింపుతో పోల్చుకుంటే గురువారం ఉదయం 400 పాయింట్లకు పైగా లాభంతో ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. మధ్యాహ్నం తర్వాత ఆ లాభాలు మరింత పెరిగాయి. ముఖ్యంగా మెటల్, ఐటీ, ఫైనాన్స్ స్టాక్స్ భారీ లాభాలను ఆర్జించాయి. దీంతో సెన్సెక్స్ చాలా రోజుల తర్వాత 76 వేలను కూడా దాటింది. చివరకు సెన్సెక్స్ 899 పాయింట్ల లాభంతో 76, 348 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 283 పాయింట్ల లాభంతో 23, 190 వద్ద స్థిరపడింది. చాలా రోజుల తర్వాత 23 వేలకు పైన రోజును ముగించింది. సెన్సెక్స్‌లో భారత్ ఫోర్జ్, మ్యాక్స్ హెల్త్‌కేర్, ఫియోనిక్స్ మిల్స్, భారతీ ఎయిర్-టె-ల్ షేర్లు లాభాలను ఆర్జించాయి. కేఈఐ ఇండస్ట్రీస్, పాలీక్యాబ్, పేటీ-ఎమ్, హావెల్స్ ఇండియా షేర్లు నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 327 పాయింట్లు- ఎగబాకింది. బ్యాంక్ నిఫ్టీ 360 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 86.37 గా ఉంది.

## అర్హత ఉన్నవారు భరణం కోరడం తగదు

### భరణం కేసులపై ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ఇటీవల కాలంలో విడాకులు, తప్పుడు కేసులను పేర్కొంటూ భర్తల్ని హింసించే భార్యల కేసులు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో పాటు పరిస్థితులకు అనుగుణంగా లేని భరణాన్ని డిమాండ్ చేస్తున్నారు. వీటిపై ఇటీవల సుప్రీంకోర్టుతో పాటు- పలు హైకోర్టులు కీలక వ్యాఖ్యలు చేశాయి. తాజాగా, ఢిల్లీ హైకోర్టు మహిళ దాఖలు చేసిన భరణం పిటిషన్‌పై కామెంట్స్ చేసింది. సంపాదించే సామర్థ్యం ఉన్న, అర్హత కలిగిన మహిళలు తమ భర్తల నుంచి మధ్యంతర భరణాన్ని కోరకూడదని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. గురువారం ఓ కేసులో జస్టిస్ చంద్రధారి సింగ్ మాట్లాడుతూ.. సీఆర్‌పీసీ లోని సెక్షన్ 125(భార్యలు, పిల్లలు, తల్లిదండ్రుల పోష) జీవిత భాగస్వాముల మధ్య సమానత్వాన్ని కొనసాగించడానికి, భార్యలు, పిల్లలు, తల్లిదండ్రులకు రక్షణ కల్పించడానికి ఈ సెక్షన్ ఉద్దేశమని, 'పని చేయకుండా ప్రోత్సహించేందుకు కాదు' అని అన్నారు. దీంతో విడిపోయిన భర్త నుంచి మధ్యంతర భరణాన్ని నిరాకరిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ని హైకోర్టు కొట్టివేసింది. ఆస్ట్రేలియా నుంచి మాస్టర్స్ డిగ్రీ, దుబాయ్‌లో పనిచేసిన అనుభవం కలిగిన మహిళ భరణాన్ని డిమాండ్ చేయడాన్ని కోర్టు తప్పుపట్టింది. పిటిషనర్‌గా ఉన్న మహిళలకు ప్రపంచ వ్యవహారాలపై విస్తృత అవగాహన ఉందని, బలమైన విద్య నేపథ్యం ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. జీవనోపాధి కోసం భాగస్వాములపై ఆధారపడే మహిళల మాదిరిగా కాకుండా, ఆమె స్వయంగా సంపాదించే అవకాశం ఉందని, భరణంపై ఆధారపడకుండా ఉద్యోగం వెతుక్కోవాలని కోర్టు ఆమెకు సూచించింది.

## వెలుగుబండ జలాలలతోనే సమస్యకు పరిష్కారం

**మార్కాపురం:** ఏడారిగా మారుతున్న పశ్చిమ ప్రకాశంలో వెలుగొండ జలాలు పారించడం ఒకటే మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు పేర్కొన్నారు. దీంతోపాటు ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణం ప్రభుత్వమే నిర్మించాలన్నారు. మార్కాపురం జిల్లా చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఓట్లు సీట్లు కోసమే ఈ ప్రాంత ప్రజలను వాడుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు ఈ ప్రాంతంలో పర్యటించిన చంద్రబాబు ఎన్నో హామీలు ఇచ్చారన్నారు. ఆ హామీలు ఏ ఒక్కటి నెరవేర్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ప్రభుత్వానికి పది నెలల సమయం ఇచ్చిన చిన్న పని కూడా చేయలేదన్నారు. ఇటీవల మార్కాపురం విచ్చేసిన చంద్రబాబు ఎలాంటి ప్రకటన చేయకుండానే వెళ్లిపోయారన్నారు. వెలిగొండ ఇతర అంశాలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం నాడు మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం జరిగింది. అనంతరం కోర్టు సెంటర్లో రాస్తారోకో చేపట్టారు.

# మరో 30 రోజుల్లో గ్రూప్స్ నియామకాలు

హైదరాబాద్: నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే ఎన్నికల్లో భారాస ఓడిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తమకు ఉద్యోగాలు ఇవ్వనివారికి ఉద్యోగాలు ఎందుకనే ఉద్దేశంతో ఆ పార్టీని నిరుద్యోగులుఓడించారన్నారు. భారాస ప్రభుత్వం చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పులు రాష్ట్రానికి గుదిబండగా మారాయని, ప్రతినెలా రూ.10 వేల కోట్ల చొప్పున అసలు, మిత్తి కింద ఇప్పటివరకు రూ.1.53 లక్షల కోట్లు చెల్లించామని తెలిపారు. కాళేశ్వరం నిర్మాణానికి 11 శాతం వడ్డీతో రుణాలు తెచ్చారని, దాన్ని 4-5 శాతం తగ్గించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక చెల్లించిన రూ.1.53 లక్షల కోట్లు తమ చేతిలో ఉంటే 75 లక్షల మందికి రుణమాఫీ చేసేవాళ్లమని, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేసేవాళ్లమని ఆయన పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.8,000 కోట్లను భారాస పెండింగ్ పెట్టడంతో వాటిని చెల్లించడం సమస్యగా మారిందన్నారు. అతికష్టమ్మీద ప్రతినెలా రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్లు చెల్లిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో త్వరలో మరో 30-40 రోజుల్లో గ్రూపు-1, 2, 3లలో 2 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు పూర్తి చేస్తామని ప్రకటించారు. తెలంగాణలో యాదగిరిగుట్ట దేవస్థానం ఉండగా తితిదేను ప్రతిసారి అడుక్కోవడం ఎందుకని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం నిర్వహించిన 'ప్రజాపాలనలో కొలువుల పండగ' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖల్లో కారుణ్య, కొత్త నియామకాలకు సంబంధించి 922 మందికి పత్రాలు అందజేశారు. బిల్డ్‌నౌ పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

పదేళ్ల కల సాకారం

"నియామక పత్రాలు అందుకుంటున్న వారికి, వారి కుటుంబ సభ్యులకు అభినందనలు. మీ కల నిజం కాబోతోంది. ముఖ్యమంత్రి పదవి చేపట్టడం కన్నా.. జడ్పీటీసీ సభ్యుడిగా విజయం సాధించినప్పుడే నాకు ఎక్కువ సంతోషం కలిగింది. తొలి ఉద్యోగం ద్వారా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఉద్యోగం చేసినంత కాలం గర్వంగా ఉండాలి తప్ప బేషరం కావద్దు. గత సర్కారు నియామకాలు చేపట్టకపోవడం వల్ల మీరు పదేళ్లు నష్టపోయారు. కారుణ్య నియామకాలపై మాట్లాడే హక్కు భారాసకు లేదు. తెలంగాణ సాధనలో నిరుద్యోగుల పాత్ర మరువలేనిది. ఎంతోమంది ప్రాణత్యాగం చేశారు. స్వరాష్ట్రం ఏర్పడినా తెలంగాణ కోసం అమరులైనవారి ఆశయాలు, నిరుద్యోగుల కలలు నెరవేరలేదు. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస పోటీ పరీక్షలను నిర్వహించలేదు. మేం ఏడాదిలోనే 59 వేల ఉద్యోగాలు ఇచ్చాం. గతంలో నోటిఫికేషన్లు వేయాలని ధర్నాలు చేసేవారు. ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. పరీక్షలు వద్దు, వాయిదా వేయండి అంటూ నిరుద్యోగులు ధర్నా చేసే పరిస్థితి వచ్చింది. వాళ్లు చేయలేని పని మేం చేస్తోంటే భారాస నేతలు తట్టుకోలేకపోతున్నారు. తామే నోటిఫికేషన్లు వేశామని, మేం చేసిందేమీ లేదనిమాట్లాడుతున్నారు.

నాపై ఎందుకుంటుంది కోపం?

నాపై వ్యతిరేకత, కోపం ఉందని కొందరంటున్నారు. ఎందుకు కోపం? 59 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చినందుకా? రైతు రుణమాఫీ చేసినందుకా? మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించినందుకా? వారిని కోటీశ్వరులను చేస్తున్నందుకా? అదానీ, అంబానీలతో పోటీపడేలా ఆడబిడ్డలకు సోలార్ విద్యుదుత్పత్తి చేసే అవకాశం కల్పించినందుకా? పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకా?

అదే టెంపర్‌మెంట్!

ఇరవై ఏళ్ల క్రితం జడ్పీటీసీ సభ్యుడిని అయినప్పటి నుంచి ఉన్న టెంపర్‌మెంట్‌తోనే ఇప్పటికీ వ్యవహరిస్తున్నాను. హుందాగా వ్యవహరించాలంటున్నారు. జానారెడ్డి ఎంత హుందాగా ఉండేవారు. అలా ఉండడం వల్ల కేసీఆర్ అవమానించారు. హోదాను బట్టి నా విజన్ మారుతోంది. కానీ, టెంపర్‌మెంట్ మారలేదు. అస్సలు మార్చుకోను. రేవంత్‌రెడ్డికి పట్టు రాలేదని కొందరు మాట్లాడుతున్నారు. రాజయ్య, ఈటల లాంటి వారిని సస్పెండ్ చేస్తేనే పట్టు వచ్చినట్టా? మా ప్రభుత్వంలో నేను, సీతక్క, శ్రీధర్‌బాబు.. ఇలా 11 మందిమి మాత్రమే మారాం. పోలీసులు, ఇతర వ్యవస్థ పాతదే. గతంలో కోదండరాం ఇంటి తలుపులు పగులగొట్టినోళ్లు.. మేం ఆదేశాలు ఇస్తే కేసీఆర్ ఇంటి తలుపులు పగులగొట్టడం ఎంతసేపు? వాళ్లలాగా మేం అణచివేయాలనుకుంటే ఎంతసేపు?

అందాల పోటీలతో రూ.వందల కోట్ల ఆదాయం..

మిస్ వరల్డ్ పోటీలపై కొందరు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. పర్యాటక రంగానికి ఇది ఒక అద్భుతమైన అవకాశం. మిస్ వరల్డ్ పోటీలతో ప్రపంచం తెలంగాణ వైపు చూడబోతోంది. వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులు తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించబోతున్నారు. 3,000 అంతర్జాతీయ ఛానెళ్లు, పత్రికలు వస్తాయి. మేం దుబారా ఖర్చులు చేయం. ఐదో, పదో కోట్లు ఖర్చు చేస్తే హోటల్, ఫుడ్ ఇండస్ట్రీకి రూ.వందల కోట్ల ఆదాయం వస్తుంది. ఫార్ములా-ఈ రేస్ ముసుగులో ప్రభుత్వ సొమ్ము దోచుకున్నవారికి, మాకు పోలికా?

ఈ ప్రశ్నకు మోదీ సమాధానం చెప్పాలి


ప్రధాని మోదీ అంటే నాకు గొప్ప గౌరవం. కానీ, ఈ ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పాలి. అభివృద్ధి అంతా దక్షిణాదిలోని తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకల్లోనే ఉంది. గుజరాత్, యూపీ, ఛత్తీస్‌గఢ్, ఝార?ండ్, ఒడిశాల నుంచి నిరుద్యోగులు మన వద్దకు ఉద్యోగాల కోసం వస్తున్నారు. ఇక్కడి నుంచి మీ వద్దకు ఎందుకు రావడం లేదు? మేం అభివృద్ధి సాధించినట్లా.. మీరు చేసినట్లా?

అక్రమాలను నిరోధించేందుకు 'బిల్డ్‌నౌ పోర్టల్'

హైదరాబాద్ నగరంలో భవన నిర్మాణ అనుమతుల్లో అక్రమాలను అరికట్టేందుకే బిల్డ్‌నౌ పోర్టల్‌ను తీసుకొచ్చాం. గతంలో మాన్యువల్‌గా అనుమతులు ఇచ్చేవారు. వాటి రికార్డులు దొరకడం లేదు. ఇకపై ఎంతటివారైనా ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాల్సిందే. దీనిపై కొందరు బిల్డర్లు నామీద అలిగారు. ఎవరు ఒత్తిడి తెచ్చినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే పరిశీలించి, దాన్ని పబ్లిక్ డొమైన్‌లో పెట్టి పారదర్శకతతో అనుమతి ఇస్తాం. కొత్త విధానం వల్ల భవనాలు కట్టే భూమి ఎవరిదో, చెరువులో ఉందో, నాలాలో ఉందో తెలుతుంది" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

## నేటి నుంచి టెన్త్ పరీక్షలు

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పదోతరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 4వ తేదీ వరకూ ఈ పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష ఉంటుంది. సైన్స్ సబ్జెక్టును రెండు విభాగాలుగా విడగొట్టారు. ఈ కారణంగా ఫిజికల్, బయలాజికల్ పేపర్లు మాత్రం ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకూ జరుగుతాయి. టెన్త్ పరీక్షల కోసం 5,09,403 మంది రిజిస్టర్ చేసుకున్నారు.మొత్తం 2,650 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. ఈసారి ప్రత్యేకంగా ప్రశ్నపత్రంలో క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెడుతున్నారు. ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే సీరియల్ నంబరు వస్తుంది. పేపర్ లీక్ అయితే అది ఎక్కడి నుంచి జరిగిందని వెంటనే గుర్తించే వీలుందని పాఠశాల విద్య డైరెక్టర్ నర్సింహారెడ్డి తెలిపారు. 28,100 మంది ఇన్విజిలేటర్లు, 2,650 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు పరీక్ష విధుల్లో ఉంటున్నట్టు ఆయన చెప్పారు. ప్రతీ పరీక్ష కేంద్రంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలను కెమెరాల ఎదురుగానే ఓపెన్ చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రానికి తేవొద్దని సూచించారు. ఉదయం 9.35 దాటితే పరీక్షకు అనుమతించమని ఎస్సెస్సీ బోర్డు స్పష్టం చేసింది.



## హరీశ్‌రావు, రాధాకిషన్‌రావులపై ఫోన్‌ట్యాపింగ్ కేసు కొట్టివేత

హైదరాబాద్: ఫోన్‌ట్యాపింగ్ చేశారంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఫిర్యాదు ఆధారంగా మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావులపై పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ గురువారం హైకోర్టు తీర్పు వెలువరించింది. హరీశ్‌రావు, రాధాకిషన్‌రావులపై కేసులో అభియోగాలకు అనుగుణంగా సరైన కారణాలు లేవని పేర్కొంది. ఫిర్యాదుదారు, హరీశ్‌రావు ఇద్దరూ ఎన్నికల్లో ఒకే నియోజకవర్గం నుంచి పోటీ చేశారని.. ఫిర్యాదులో రాజకీయ శత్రుత్వం కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. ఫిర్యాదు చేయడంలో అసాధారణ జాప్యానికి కారణాలు పేర్కొనలేదని తెలిపింది. హరీశ్‌రావు, రాధాకిషన్‌రావులపై కేసు నమోదుకు తగిన కారణాలు లేవంటూ ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేసింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు ఆధారంగా పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ టి.హరీశ్‌రావు, రాధాకిషన్‌రావులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారించిన జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం తీర్పు వెలువరించారు. ఫిర్యాదుదారు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో.. బలవంతపు దోపిడీకి పాల్పడినట్లుగానీ, పబ్లిక్ సర్వెంట్‌గా విశ్వాసఘాతుకానికి పాల్పడినట్లుగానీ, నేరపూరిత బెదిరింపులకు సంబంధించిగానీ ఎలాంటి ఆరోపణలు చేయలేదని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.ఐటీ చట్టంలోని సెక్షన్ 66 కింద ఫిర్యాదులో ఎలాంటి ఆరోపణలు లేవన్నారు. ఆరోపణలన్నీ ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించినవే అన్నారు. ప్రస్తుత కేసులో ఫిర్యాదుదారు చక్రధర్‌గౌడ్‌ను బెదిరించి ఆస్తి, డబ్బును వసూలు చేసినట్లు హరీశ్‌రావుపై ఎలాంటి ఆధారాలు లేవని, అలాంటప్పుడు ఐపీసీ సెక్షన్ 386 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి అనుమతించలేమని, దాన్ని కొట్టివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో అరెస్టయిన రాధాకిషన్‌రావు 2023 ఆగస్టు నుంచి ఈ ఏడాది జనవరి 30 దాకా జ్యుడిషియల్ కస్టడీలోఉన్నారని, దర్యాప్తు పూర్తయి అభియోగపత్రం దాఖలైందని.. ఇదే కేసులో 60వ సాక్షిగా చక్రధర్‌గౌడ్ వాంగ్మూలాన్ని నమోదు చేశారని, అందులో చెప్పినవే ఈ ఫిర్యాదులోనూ పేర్కొన్నారన్నారు. చక్రధర్‌ను పలు కేసుల్లో అరెస్ట్ చేసినట్లు పోలీసులు, చక్రధర్‌గౌడ్ దాఖలు చేసిన కౌంటర్లలో పేర్కొన్నారని.. చక్రధర్‌గౌడ్‌ను ఆయా కేసుల్లో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినప్పుడు రాధాకిషన్ తనను వేధించినట్లు ఎప్పుడూ ఫిర్యాదు చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో ఐపీసీ 386, 409, 506లతోపాటు ఐటీ చట్టం సెక్షన్ 66 కింద కేసును కొనసాగించడానికి ఎలాంటి కారణాలు లేవన్నారు. ఇలాంటి సమయంలో సెక్షన్ 482 కింద కేసును కొట్టివేసే అధికారం హైకోర్టుకు ఉందంటూ భజన్‌లాల్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందన్నారు. ఇంత జాప్యమా.హరీశ్‌రావు, రాధాకిషన్‌రావులపై ఫిర్యాదు చేయడంలో అసాధారణమైన జాప్యం జరిగిందని న్యాయమూర్తి పేర్కొన్నారు. 2023 ఏప్రిల్‌లో సివిల్ దుస్తుల్లో పోలీసులు తనను తీసుకెళ్లారని.. యాపిల్ ఫోన్ నుంచి 2023 ఆగస్టులో హెచ్చరిక సందేశం వచ్చిందని ఫిర్యాదుదారు చెబుతున్నారని, అయితే డీజీపీకి 2024 జూన్ 19న వినతిపత్రం సమర్పించారన్నారు. ప్రస్తుత ఫిర్యాదు గత ఏడాది డిసెంబరు 1న చేశారని, సంఘటనలు 2023 ఏప్రిల్‌లో జరిగినా ఫిర్యాదు చేయడానికి ఇంత జాప్యం ఎందుకన్న దానికి ఎలాంటి కారణాలు పేర్కొనలేదన్నారు. హరీశ్‌రావు మంత్రిగా ఉండటం, రాధాకిషన్‌రావు ఆయనకు సన్నిహితుడిగా ఉండటంతో భయంతో ఫిర్యాదు చేయలేదంటూ ఫిర్యాదుదారు న్యాయవాది వాదనల సందర్భంగా చెప్పారని, ఒకవేళ అదే వాస్తవం అయితే 2023 డిసెంబరులో ప్రభుత్వం మారిందని, అప్పుడైనా ఫిర్యాదు చేయలేదన్నారు. హస్‌ముఖ్‌లాల్ డి.వోరా వర్సెస్ తమిళనాడు, ముదవత్ జ్యోతి వర్సెస్ తెలంగాణ కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం.. జాప్యానికి కారణాలు పేర్కొనకపోవడంతో దీన్ని అనుమతించలేమన్నారు. ప్రస్తుతం ఈ కేసు కొనసాగింపునకు అనుమతిస్తే న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేసినట్లవుతుందని పేర్కొన్నారు.

వేగుచుక్క

# ఆర్కిడ్స్"లో ఘనంగా "గ్రాడ్యుయేషన్ డే" వేడుకలు.

గ్రాడ్యుయేషన్ గౌన్లు ధరించిన విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేత.

బాల్యంలోనే బలమైన విద్యా పునాదులు వేయాలి.

పాఠశాల యాజమాన్యం పిలుపు.














**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మార్చి 20**

ఆర్కిడ్స్ హైస్కూల్ లో యూకేజి గ్రాడ్యుయేషన్ డే వేడుకను గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల విద్యా ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన ఘట్టం కావడంతో, వారి విజయాలను తల్లిదండ్రులు, అధ్యాపకులు, అతిథులు కలిసి జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ అండ్ చైర్మన్ సి ఎచ్. గోవర్ధన్ రెడ్డి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా. ఎం. జైపాల్ రెడ్డి (సీఈఓ, ఆర్కే గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్), డైరెక్టర్ మర్రి సదాశివ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మర్రి భూలక్ష్మి, అకాడమిక్ ఇన్‌ఛార్జ్ వసంత హాజరై విద్యార్థులను అభినందించారు.

గ్రాడ్యుయేషన్ మార్చ్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పిల్లలు గ్రాడ్యుయేషన్ గౌన్లు ధరించి సర్టిఫికేట్లు అందుకున్నారు.

**పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ...**

ఈ సందర్భంగా డా. ఎం. జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, బాల్యంలోనే బలమైన విద్యా పునాదులు వేయడం ఎంతో ముఖ్యమని, తల్లిదండ్రులు పిల్లల ఆసక్తిని పెంచేలా ప్రోత్సహించాలని సూచించారు. సిఎచ్. గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, టీచర్లు విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన బోధనను కొనియాడారు. డైరెక్టర్ మర్రి సదాశివ రెడ్డి విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే విధానాల గురించి వివరించారు.

**తల్లిదండ్రుల స్పందన:**

ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు తమ అనుభవాలను పంచుకున్నారు. "మా పిల్లల ప్రతిభను ప్రోత్సహించి, వారికి మద్దతుగా నిలిచిన టీచర్లకు కృతజ్ఞతలు తెలిపారు. వారి బోధన వల్ల మా పిల్లల్లో విశ్వాసం పెరిగిందనీ" అన్నారు."ఈ విద్యా సంవత్సరం మా పిల్లల అభివృద్ధిని చూసి మేమెంతో ఆనందిస్తున్నాం అని విద్యార్థులకు గొప్ప భవిష్యత్తు అందించేందుకు స్కూల్ నిరంతరం కృషి చేస్తోంది" అని పేర్కొన్నారు.

## టెక్సాస్ విశ్వవిద్యాలయంతో టియు అవగాహన ఒప్పందం.



**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, మార్చి 20:**

అమెరికా విశ్వవిద్యాలయంలోని కమ్యూనిటీ కళాశాలల పరిశోధక విద్యార్థులు భారత విశ్వవిద్యాలయాలలో పరిశోధన కోసం భారతదేశంలోని విశ్వవిద్యాలయాల విద్యార్థులు టెక్సాస్ విశ్వవిద్యాలయంలో పరిశోధనలు చేయుటకు అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ అవగాహన ఒప్పందంపై తెలంగాణ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య టి. యాదగిరిరావు, టెక్సాస్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య బొబ్బిలి అనంత సుధాకర్ గురువారం సంతకాలు చేసి ఒప్పంద పత్రాలు మార్పిడి చేసుకున్నారు. ఈ సందర్భంగా అమెరికా టెక్సాస్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య బొబ్బిలి అనంత సుధాకర్ తెలంగాణ విశ్వవిద్యాలయన్ని సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, తెలంగాణ విశ్వవిద్యాలయ విద్యార్థులు టెక్సాస్ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేయడానికి అవగాహన ఒప్పందం జరగడం స్వాగతించాలన్నారు. తెలంగాణలో విశిష్టమైన సహజ వనరులను ఉపయోగంలోకి తీసుకువచ్చి తెలంగాణ అభివృద్ధికి ఈ పరిశోధనలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. భారతదేశ విద్యాలయాలలో తెలంగాణ విశ్వవిద్యాల యంతో ఒప్పందం జరగడం గర్వకారణమని తెలంగాణ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య టి. యాదగిరిరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా ప్రిన్సిపల్ యూనివర్సిటీ కాలేజ్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల వ్యవహరించగా లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసన్న రాణి, ఇఫ్లూ ప్రొఫెసర్ కోన ప్రకాష్ లు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి.

**ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ**

**అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్, కలెక్టర్ తో**

**కలిసి అమృత్ 2.0 పనుల ప్రగతిపై సమీక్ష.**








**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 20**

: ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు వీలుగా ఆయా పథకాల కింద నగర పాలక సంస్థ పరిధిలో చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ అధికారులకు సూచించారు. గురువారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అర్బన్ శాసనసభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు లతో కలిసి అమృత్ 2.0 పథకం పనుల ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. సుమారు 400 కోట్ల రూపాయల విలువ గల పనులకు గత జనవరి నెలలో జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి షబ్బీర్ అలీ ఇతర ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేసిన విషయం విధితమే. ప్రస్తుతం ఆ పనులు ఏ దశలో కొనసాగుతున్నాయి అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిధుల కొరత ఎంతమాత్రం లేదని, పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయించేందుకు అధికారులు అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు. ముఖ్యంగా ప్రస్తుత వేసవి సీజన్లో నగరంలో ఇంటింటికి రక్షిత మంచినీరు సరఫరా అయ్యేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. రోడ్లు, ఇతర పెండింగ్ పనులను పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సుదీర్ఘ కాలం నుండి పెండింగ్ లో ఉన్న నిజామాబాద్ మాస్టర్ ప్లాన్ గురించి కూడా ఉన్నతాధికారులతో ఇటీవలే చర్చించామని అన్నారు. మాస్టర్ ప్లాన్ అమలు జరిగితే నిజామాబాద్ నగరం మరింత వేగంగా అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా అధికారులు ప్రజోపయోగ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే నిజామబాద్ నగరపాలక సంస్థ పనితీరు కలెక్టర్ పర్యవేక్షణలో ఎంతో బాగుందని షబ్బీర్ అలీ ప్రశంసించారు. ప్రస్తుత రంజాన్ మాసంలో ఎలాంటి ఫిర్యాదులకు తాగు లేకుండా శానిటేషన్ పండ్లను జరిపిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో నుడా ఛైర్మన్ కేశ వేణు, మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**

అనంతరం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ నిజామాబాద్ సౌత్, నార్త్ మండలాల లబ్ధిదారులకు జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 565 మందికి రూ. 5.65 కోట్ల పైచిలుకు విలువ చేసే చెక్కులను అందజేశారు.

## జిల్లా జైల్లో టిబి అవగాహనా సదస్సు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 20:**



సారంగాపూర్ జిల్లా జైల్లో టిబి అవగాహనా మరియు హె. చ్. ఐ. వి, హేపాటిటీస్ బి పరీక్షలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జైల్ సూరిండెంట్ ఆనంద్ రావు మాట్లాడుతూ, టిబి లక్షణాలు, అది సోకకుండా జాగ్రత్తల గురించి ఖైదీలకు వివరించారు. 430 మంది ఖైదీలకు టిబి స్క్రీనింగ్ నిర్వహించామని, అందులో 27 మంది ఖైదీల తెమడా నమూనాలను సేకరించమని తెలిపారు.

ఈ కార్యక్రమం లో జిల్లా టిబి నియంత్రణ అధికారి డాక్టర్ దేవి నాగేశ్వరి, జైలర్ రాజశేఖర్ రెడ్డి, జైల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దినేష్, జిల్లా టిబి సమన్వయ కర్త రవిగౌడ్, డి. పి. యం. సుధాకర్, సాతి ఎన్జిఓ వినోద్, మహేష్, జైల్ ఫార్మసిస్ట్ రాంచందర్, టిబి సూపెర్వైసోర్ స్రవంతి, మరియు ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## ఓయూ "బంద్" ఉద్రిక్తం.

**వేగుచుక్క న్యూస్, హైదారాబాద్, మార్చి 20**

అప్రజాస్వామిక సర్క్యులర్ రద్దు కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు గురువారం తల పెట్టిన ఓయూ బంద్ ఉద్రిక్తంగా మారింది. ఓయూ ఆర్ట్స్ కళాశాలలో క్లాస్ లను బైకాట్ చేసి ర్యాలీకి బయలుదేరగా, పోలీసులు ఆర్ట్స్ కళాశాలలో కి వచ్చి విద్యార్థి నాయకులను బలవంతంగా అరెస్టు చేశారు. ఈ క్రమంలో విద్యార్థులకు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, గత వారం రోజులుగా సర్క్యులర్ వెనక్కి తీసుకోవాలని శాంతియుతంగా పోరాడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం, ఓయూ వీసీ, రిజిస్ట్రార్ మౌనం వీడటం లేదన్నారు. ఓయూ అడ్మినిస్ట్రేషన్ వైఖరిని నిరసిస్తూ బంద్ నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్యాన్ని అమలు చేస్తామని చెప్పి నేడు నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, ప్రజా ఉద్యమాలపై ఆంక్షలు విధిస్తున్నారనీ, ప్రజా పాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు.

**అప్రజాస్వామిక సర్క్యులర్ రద్దు కోసం విద్యార్థి సంఘాల డిమాండ్.**

**పోలీసులు, విద్యార్థి నాయకుల మధ్య వాగ్వాదం, అరెస్టు.**

**అరెస్టు లపై ప్రజా సంఘాల ఆగ్రహం.**







# త్రాగునీటి సమస్య లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలి.



ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మార్చి 20:**

ప్రజలకు ఈ వేసవిలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కామారెడ్డి శాసన సభ నియోజక వర్గంలో త్రాగునీటి సమస్యలు, ప్రత్యామ్నాయ ఏర్పాట్ల పై పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓ, ఎంపీడీఓ, డివిజనల్ పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నియోజక వర్గంలో 48 గ్రామాలలో 53.36 లక్షల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. అట్టి నిధులతో ఆయా గ్రామాలలో పనులు చేపట్టి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేసి త్రాగునీటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. మున్సిపల్ పరిధిలో ఇప్పటికే 5 కొత్త ట్యాంకర్లు కొనుగోలు చేస్తున్నామని, పాతవి 3 ట్యాంకర్ల తో నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన పక్షంలో మరో 4 ట్యాంకర్లు కొనుగోళ్లు చేపడతామని తెలిపారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు వస్తే గ్రామ పంచాయతీ నిధుల నుండి పనులు చేపట్టాలని, అవసరమైతే ఇతర నిధులు సమకూరుస్తామని తెలిపారు. ఇకముందు త్రాగునీటి ఇబ్బందులు ఏర్పడినవి అవసరమైన పనులకు ప్రతిపాదనలు సమర్పించాలని మిషన్ భగీరథ ఈఈ, జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ నుండి కామారెడ్డి వరకు డి. ఐ. కొత్త పైప్ లైన్ పనులను వేగవంతం చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ లు, మండల పరిషత్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి నీటి సమస్యలు రాకుండా చూడాలని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం క్రింద మంజూరు చేసిన సి.సి. రోడ్ల పనులు మార్చి నెల లోగా పూర్తిచేయాలని అన్నారు.

కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు నీళ్ళ సమస్యలు కోసం రొడ్డెక్కకుండ చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శుల పై ఉందని, క్షేత్ర స్థాయిలో పర్యటించి ముందస్తు ప్రణాళికలతో నీటి సరఫరా అయ్యే విధంగా స్థానిక, ఉన్నతాధికారు లకు సమాచారం అందించి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. అవసరమైన ప్రతిపాదనలు స్థానిక అవసరాలను బట్టి స్పష్టంగా ఒకే ఫార్మాట్ లో సిద్ధం చేయాలనీ సూచించారు. వచ్చే జూన్ మాసం

వరకు నీటి సమస్యలు రాకుండా చూడాలని పేర్కొన్నారు.పంచాయతీ కార్యదర్శులకు ప్రతీ నీటి వసతులపై అవగాహన ఉండాలని తెలిపారు. అంతిమంగా ప్రజలకు అవసరమయ్యే త్రాగునీటి సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శుల పై ఉందని అన్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఉన్న ట్యాంకర్లు అందుబాటులోకి తీసుకురావాలని, ఏమైనా మరమ్మత్తులు ఇంటే చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ రమేష్, జిల్లా పంచాయతీ అధికారి మురళీ, కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, ఎంపీడీఓ లు, డివిజనల్ పంచాయతీ అధికారులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అధారిటి మెంబర్‌గా డాక్టర్ కవిత రెడ్డి.

**- నియామకం పత్రం అందించిన జిల్లా జడ్జి.**


**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్**

ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ కవిత రెడ్డిని డిస్ట్రిక్ లీగల్ సెల్ సర్వీసెస్ అధారిటి మెంబర్‌గా ఎంపిక చేశారు. ఎంపిక చేసిన ఉత్తర్వుల కాపీని జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల చేతుల మీదుగా గురువారం అందుకున్నారు.



## సింధు ఔట్

బసెల్: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు పేలవ ఫామ్ కొనసాగుతోంది. ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్‌లో తొలి రౌండ్లోనే ఓడిపోయిన ఆమె.. స్విస్ ఓపెన్‌లోనూ మొదటి రౌండ్ దాటలేపోయింది. బుధవారం జరిగిన పోరులో 17-21, 19-21తో జూలీ దవాల్ జాకోబ్సెన్ (డెన్మార్క్) చేతిలో ఓడిపోయింది. ఇద్దరు భారతీయుల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇషారాణి బారువా 18-21, 21-17, 22-20తో ఆకర్షికి షాకిచ్చింది. మాళివిక బాన్సోద్ 22-20, 14-21, 19-21తో మిచెలీ లీ (కెనడా) చేతిలో, రక్షిత 11-21, 17-21తో లైన్ క్రిస్టోఫెర్సెన్ (డెన్మార్క్) చేతిలో ఓడిపోయారు. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 23-21, 23-21తో హెచ్ఎస్ ప్రయణ్‌పై విజయం సాధించాడు.



## కింగ్ డమ్ టీజర్ ఓ.ఎస్.టి.కి హ్యూజ్ రెస్పాన్స్

హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న 'కింగ్ డమ్' సినిమా టీజర్ ఒరిజినల్ సౌండ్ ట్రాక్ రిలీజై సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ టీజర్ కు మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ కంపోజ్ చేసిన బీజీఎం ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేస్తోంది. 'కింగ్ డమ్' టీజర్ కు వచ్చిన హ్యూజ్ రెస్పాన్స్ కు అనిరుధ్ మ్యూజిక్ వన్ ఆఫ్ ది రీజన్ అయ్యింది. ఇప్పుడు ఒరిజినల్ సౌండ్ ట్రాక్ లో ఆ బీజీఎంను కంప్లీట్ గా ఎంజాయ్ చేస్తున్నారు మ్యూజిక్ లవర్స్. ఈ సినిమా మీద ఆడియెన్స్ కు ఉన్న క్రేజ్ ను టీజర్ ఓఎస్ టీకి వస్తున్న రెస్పాన్స్ రిఫ్లెక్ట్ చేస్తోంది. విజయ్ దేవరకొండ కెరీర్ లో ఒక మైల్ స్టోన్ మూవీగా 'కింగ్ డమ్' ఉండబోతోంది. ఈ చిత్రాన్ని యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి రూపొందిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్ టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్ పై నాగవంశీ, సాయి సౌజన్య భారీ పాన్ ఇండియా చిత్రంగా నిర్మిస్తున్నారు. 'కింగ్ డమ్' సినిమా మే 30న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.



## నన్ను జడ్జ్ చేయడానికి మీకున్న అర్హత ఏమిటి..?

### కంగనా ఫైర్

చిత్ర పరిశ్రమకు చెందిన వారిపై నటి, ఎంపీ కంగనా రనౌత్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఎమర్జెన్సీ' చిత్రాన్ని ఉద్దేశించి దర్శక నిర్మాత సంజయ్‌గుప్తా ఇచ్చిన రివ్యూపై ఆమె స్పందించారు. కంగన తన అంచనాలు తప్పని నిరూపించారని ఆయన పేర్కొనడంపై ఆమె మాట్లాడారు. ముందుగానే తనపై ఒక అభిప్రాయానికి రావొద్దని విజ్ఞప్తి చేశారు.

"నాపై ముందుగానే ఒక అభిప్రాయానికి వచ్చినట్టు ఆయన తన పోస్ట్‌లోనే అంగీకరించారు. నన్ను అర్థం చేసుకోవడంలో మీరు పరాజయం అయినప్పుడు.. మళ్లీ నాపై ఒక అభిప్రాయానికి రావాలని ఎందుకు అనుకుంటున్నారు? తన అభిప్రాయం తప్పిందని ఆయన పేర్కొన్నారు. నేను ఎలాంటి సినిమా చేశానో మీకు ముందే ఎలా తెలుసు? నా గురించి ముందే తెలుసుకునేందుకు మీవద్ద ఏమైనా అద్భుత శక్తులు ఉన్నాయా? ఒక వ్యక్తి గురించి ఏదైనా అభిప్రాయానికి రావాలంటే వాళ్ల గురించి అన్ని విషయాలు తెలుసుకొని ఉండాలి. అయినా నన్ను జడ్జ్ చేసేందుకు మీకున్న అర్హతలు ఏమిటి? మీరు ఎలాంటి సినిమాలు రూపొందించారు? ఇండస్ట్రీలో ఉన్నవాళ్లు కూడా.. తాము ఎలాంటి సినిమాలు తెరకెక్కిస్తున్నారో ఒక్కసారి చెక్ చేసుకోవాలి"

## డబ్బులెక్కువ ఇస్తే ఆమె తీసుకోలేదు..: ప్రియాంకా



తన తదుపరి సినిమా 'ఎస్ఎస్ఎంబీ 29' సంబంధించి ఒడిశా షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్నారు నటి ప్రియాంకా చోప్రా. షూటింగ్ అనంతరం ఆమె న్యూయార్క్‌కు తిరిగి ప్రయాణమయ్యారు. ఈక్రమంలోనే తనకు ఎదురైన ఓ ఆసక్తికర సంఘటన గురించి తాజాగా ఆమె ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. ఎస్-ఎస్ఎంబీ29 షూట్, తన ప్రయాణానికి సంబంధించిన ఫొటోలను తాజాగా ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు ప్రియాంక చోప్రా. అందులో ఆమె ఒక వీడియోను పంచుకుంటూ.. "అరుదుగా నేను వీడియోలు షేర్ చేస్తుంటా. ఇలాంటి ఆసక్తికర విషయాలు పంచుకుంటా. ఒక మహిళ తీరు చూసి ఈరోజు నేనెంతో స్ఫూర్తి పొందా. విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తున్న సమయంలో జామపళ్లు విక్రయిస్తూ ఒక మహిళ నాకు కనిపించింది. జామపళ్లు నాకెంతో ఇష్టం. ఆమెను ఆపి ధర ఎంత అని అడిగాను. దానికి రూ.150 అని చెప్పింది. రూ.200 ఇచ్చి పళ్లు కొనుగోలు చేశా. చిల్లర ఇవ్వబోతుంటే వద్దని.. మిగిలిన డబ్బు ఉంచుకోమని అన్నా. ఆమెకు ఇదే జీవనాధారం అని నాకు తెలుసు. కొంతసేపటికి ఆమె అక్కడికి నుంచి వెళ్లి వెంటనే తిరిగి నా వద్దకు వచ్చి మరి కొన్ని పళ్లను ఇచ్చింది. ఆమె నిజమైన వర్కింగ్ ఉమెన్. సాయాన్ని ఆమె కోరుకోలేదు. ఆమె ప్రవర్తన నా మనసును గెలిచింది" అని ప్రియాంక పేర్కొన్నారు.

## శబరిమలలో మోహన్‌లాల్.. మమ్ముట్టి కోసం ప్రత్యేక పూజలు



మలయాళ అగ్ర నటులు మోహన్‌లాల్, మమ్ముట్టి మధ్య ఎన్నోఏళ్ల నుంచి ఆత్మీయ స్నేహబంధం ఉన్న విషయం తెలిసిందే. తన స్నేహితుడు మమ్ముట్టిపై ఉన్న అభిమానాన్ని మోహన్‌లాల్ మరోసారి బయటపెట్టారు. తన తదుపరి చిత్రం 'ఎల్2: ఎంపురాన్' రిలీజ్‌ను పురస్కరించుకొని మంగళవారం ఆయన శబరిమలను సందర్శించారు. ఇందులోభాగంగా తన కుటుంబ సభ్యులతోపాటు ఆప్తమిత్రుడు మమ్ముట్టి కోసం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ పూజా సమయంలో మమ్ముట్టి అసలు పేరు మహ్మద్ కుట్టి అని ఆయన చెప్పినట్లు స్థానిక పత్రికల్లో కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై సినీప్రియులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మమ్ముట్టి అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్నారంటూ ఇటీవల వార్తలు చక్కర్లు కొట్టాయి. ఆయా కథనాలను ఆయన టీమ్ కొట్టి పారేసింది. "మమ్ముట్టి ఆరోగ్యం గురించి జరుగుతోన్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదు. రంజాన్ కారణంగా ఆయన షూట్స్ నుంచి బ్రేక్ తీసుకొని వెకేషన్‌కు వెళ్లారు. విరామం నుంచి తిరిగి వచ్చిన వెంటనే ఆయన మోహన్‌లాల్‌తో కలిసి మహేశ్ నారాయణన్ చిత్రంలో పాల్గొననున్నారు" అని టీమ్ పేర్కొంది.

## ఒడిశా షెడ్యూల్ పూర్తి..



ప్రముఖ దర్శకుడు రాజమౌళి , నటుడు మహేశ్ బాబు కాంబినేషన్‌లో ఒక భారీ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. గత 15 రోజుల నుంచి ఈ సినిమా చిత్రీకరణ ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో జరుగుతోంది. సిమిలిగుడ సమీపంలోని మాలి, పుట్‌సీల్, బాల్డ ప్రాంతాల్లో నటీనటులపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. మంగళవారం రాత్రి ఒడిశా షెడ్యూల్ పూర్తైంది. దీంతో నటీనటులను చూసేందుకు అభిమానులు ఆసక్తి చూపించారు. సెట్‌కు చేరుకొని నటీనటులు, ఇతర చిత్రబృందంతో ఫొటోలు దిగారు.

పొట్టంగి ఎమ్మెల్యే రామ్‌చంద్ర కదం నేతృత్వంలో పలువురు ప్రజాప్రతినిధులు చిత్రబృందాన్ని కలిశారు. ఇక్కడి ప్రకృతి అందాలు తనని ఎంతగానో ఆకట్టుకున్నాయని, ఇదొక స్వర్గసీమ అని వర్ణించారు. జిల్లా యంత్రాంగం, ప్రజల సహకారం ఎప్పటికీ మరువలేమని కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు థాంక్స్ నోట్‌ను అధికారులకు అందించారు. యూనిట్ సభ్యులందరూ మంగళవారం రాత్రే అక్కడినుంచి హైదరాబాద్‌కు బయలుదేరగా.. నటీనటులు, రాజమౌళి బుధవారం ఉదయం ఆ ప్రాంతాన్ని వీడారు. బయలుదేరే ముందు హీరో మహేశ్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ వర్మ, జయపురం సబ్ కలెక్టర్ సస్యరెడ్డి, ఇతర అధికారులు కలిసి ఫొటోలు దిగారు.